Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్


జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 289 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :289 | ఆదివారం 19 అక్టోబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4



# సేనతో సేనాని

నవతరం యువతను భాగస్వామ్యం చేసేందుకు, సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ "సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన పార్టీ ప్రకటించింది

ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది

ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేసేందుకు, సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేందుకు "సేనతో సేనాని - మన నేల కోసం కలిసి నడుద్దాం" అంటూ ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని జనసేన పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా ఔత్సాహిక యువతీ, యువకులు తమకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని సేవలు అందించే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది. మార్పు కోరుకుంటే రాదు - మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుంది. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకు నేందుకు రిజిస్టర్ చేసుకునే అవకాశాల్ని కల్పించారు. సేనతో సేనాని కార్యక్రమం ఆగస్టు 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం లో విస్తృత స్థాయిలో జరిగింది. జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్తలు, యువత వేలాదిగా పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ ప్రసంగంలో పార్టీ భవిష్యత్ ప్రణాళికలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి, సమాజ సేవలు చర్చించారు. పోరాటం చేసేవాడే వీరుడు కాదు, అండగా నిలబడిన ప్రతి ఒక్కరూ వీరులే అని ఆయన అన్నారు. ఆ సమావేశం స్ఫూర్తిని కొనసాగించేందుకు ఈ ఏర్పాటుచేశారు. పాల్గొనాలనుకునే యువత ఖీఖీ కోడ్ స్కాన్ చేసి లేదా లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. పార్టీ అధికారిక సోషల్ మీడియా పోస్టలలో ఖీఖీ కోడ్ అందుబాటులో ఉంది. లైవ్ స్ట్రీమింగ్ కోసం యూట్యూబ్ లింక్: ఈ కార్యక్రమం జనసేన పార్టీకి రెట్టింపు బలాన్ని ఇస్తుందని, యువతను సమాజ సేవలోకి తీసుకువచ్చి భవిష్యత్ నాయకులను తయారు చేస్తుందని భావిస్తున్నారు.

## ఈ ఏడాది కూడా ప్రయాణంలోనే దీపావళిని జరుపుకోవాల్సి వస్తోంది



- ఏడు రోజుల పర్యటన నిమిత్తం ఆస్ట్రేలియా బయల్దేరిన నారా లోకేశ్
- ఏపీ యువతకు అవకాశాలు కల్పించడమే ప్రధాన అజెండా
- యూనివర్సిటీల అధిపతులు, ప్రముఖ కంపెనీల సీఈఓలతో సమావేశం
- సీఫుడ్ ఎగుమతిదారుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చలు
- ఆస్ట్రేలియాలోని తెలుగు కమ్యూనిటీతో భేటీ కానున్న లోకేశ్
- పెట్టుబడులే రాష్ట్రానికి ఇచ్చే దీపావళి కానుక అని వ్యాఖ్య

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ యువతకు ఉపాధి, నైపుణ్య రంగాల్లో కొత్త అవకాశాలు సృష్టించడమే లక్ష్యంగా నారా లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటనకు బయల్దేరారు. 'స్పెషల్ విజిటర్స్ ప్రోగ్రాం'లో భాగంగా ఏడు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి కొన్ని ఆస్ట్రేలియన్ కంపెనీల పెట్టుబడులను తీసుకురాగలిగితే, అదే మన ప్రజలకు ఉత్తమమైన దీపావళి కానుక అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా నేను ఈ రోజు ఆస్ట్రేలియా పర్యటనకు బయల్దేరాను. 'స్పెషల్ విజిటర్స్ ప్రోగ్రామ్' కింద ఏడు రోజుల పాటు - మిగతా3లో




## జీఎస్టీ ధమాకాతో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు

- సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగింది
- జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టాం
- దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోంది
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

## జగన్ కుట్రలను తిప్పి కొట్టాలి

- పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- మంత్రులు స్పందిస్తున్నారు కదా అని నేతలు మౌనంగా ఉంటే ఎలా?
- జగన్ కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వంపై జరుగుతున్న విష ప్రచారాన్ని అడ్డుకోవాలని సూచన
- మంత్రులతో పాటు పార్టీ నేతలు కూడా స్పందించాలని స్పష్టం
- జోగి రమేశ్ పై చట్టం తనపని తాను చేసుకుపోతుందన్న సీఎం
- విశాఖకు గూగుల్ రావడంపై చంద్రబాబుకు నేతల అభినందనలు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

కూటమి ప్రభుత్వంపై జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని పార్టీ శ్రేణులన్నీ కలిసికట్టుగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పిలుపునిచ్చారు. మంత్రులు స్పందిస్తున్నారు కదా అని పార్టీ నేతలు మిన్నకుండిపోతే సరిపోదని, ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

జగన్ చేస్తున్న కుట్రలపై ప్రభుత్వంతో పాటు పార్టీ నేతలు కూడా సమాంతరంగా పని చేయాల్సిందేనని ముఖ్యమంత్రి - మిగతా3లో



## బీజేపీకి ఒక మతాన్ని అంటకట్టడం కరెక్ట్ కాదు

- అన్ని వర్గాల ప్రజల క్షేమం కోసం దేశవ్యాప్తంగా యాగాలు నిర్వహిస్తాం
- వివక్ష గురవుతున్న సమాజంలో వారి గుర్తింపు, గౌరవాన్ని పెంచుతాం
- క్షురకులు అంటే సమాజంలో చిన్నచూపు ఉంది
- నాయిబ్రాహ్మణులు బలహీనులు కాదు, బలవంతులని తెలియచెప్పడమే బీజేపీ ఉద్దేశ్యం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్

## కొత్త ముసుగులో 'జంగల్‌రాజ్'

- "గత పాలనలో బిహార్ ఓ గుంతలా మారింది
- 20 ఏళ్లలో దీన్ని పూడ్చాం. ఇప్పుడు బలమైన పునాదులపై నిర్మాణాలు చేపడతాం
- కొత్త ముసుగు ధరించి.. ఆటవిక రాజ్యాన్ని తిరిగి తీసుకురావాలని ఆశిస్తున్నవారిని ఓటర్లు నమ్మొద్దు : కేంద్ర మంత్రి అమిత్ షా



## పాక్‌లోని ప్రతి అంగుళం.. బ్రహ్మోస్ రేంజ్‌లోనే



- భారతీయ సైనిక బలగాలకు బ్రహ్మోస్ ఓ పిల్లర్‌లా మారింది
- కలలను నిజం చేసే పరిస్థితి ఏర్పడింది
- మిస్సైల్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, ఫైనల్ క్వాలిటీ చెకింగ్‌కు కావాల్సిన అన్ని ఆధునిక సదుపాయాలు ఉన్నాయి
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## కల్తీ మద్యం సూత్రధారులు, పాత్రధారులకు చుక్కలు చూపిస్తాం



- మద్య నిషేధం అమలు చేశాకే 2024లో ఓట్లు అడుగుతామని చెప్పి.. కల్తీ మద్యం అమ్మిన నీచ చరిత్ర వైకాపాది
- పేర్ని నానికి మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదు
- రూ.99 బ్రాండ్లు నిలిపివేశామనడం అతని అజ్ఞానానికి నిదర్శనం

## ఎం.వి.ఆర్ డిగ్రీ కాలేజ్‌లో ఘనంగా సి.పి.ఆర్ అవగాహన సదస్సు



**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
గంగవరంమండలంలో గల సాయినగర్ లోగల ఎం.వి.ఆర్ డిగ్రీ కాలేజ్‌లో ఇండి యన్ మెడికల్ హెల్త్ ఆర్గనైజేషన్, ఎన్. ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సి.పి.ఆర్ వారోత్స వాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఐఎంహెచ్ ఓ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ సి.పి.ఆర్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అత్యవసర సమయాల్లో సి.పి.ఆర్ ద్వారా ప్రథమ చికిత్స అందించడం, ద్వారా అసహాయల కు ప్రాణ దానం చేయచ్చుని, ప్రతి ఒక్కరూ సి.పి.ఆర్ గురించి తమ స్నేహితులకు తమ కుటుంబం సభ్యులకు అవగాహన కలిగించాలని సూచించారు. విద్యార్థుల చేత సిపిఆర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సుధా కరస్పాండెంట్ ఎం.వి.ఆర్.రెడ్డి డాక్టర్డాక్టర్.యుగంధర్ డాక్టర్. మంజుశ్రీ అధ్యక్షులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.ధ

## పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



**పీలేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
అన్నమయ్యజిల్లా పీలేరు రాష్ట్రంలో మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేసి పేద విద్యార్థులకు వైద్యం విద్యను దూరం చేయాలన్నది కూటమి ప్రభుత్వం ధ్యేయ మని మాజీఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు కేవీ పల్లిలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యవిద్య అందుతున్న తరుణంలో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం ఇందుకు నిదర్శనం అన్నారు. 16 నెలలుగా రాష్ట్రంలో నకిలీ మద్యం రాజ్యమేలుతుందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకట రమణ రెడ్డి ,పెద్ద బాబు రెడ్డి, కోర్టు సుబ్బా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాహూల్ రెడ్డి, రవి చంద్ర రెడ్డి, గంగి రెడ్డి, మహేష్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, ఈశ్వర రెడ్డి, తూపల్లి సర్పంచ్ ఆనంద రెడ్డి,మాజీ సర్పంచ్ ఆనంద రెడ్డి,గౌరీ శంకర్ రెడ్డి, శిరసాని వెంకట రమణ రెడ్డి,గుంపు జయ రాము,పెద్దిరెడ్డి ద్వారక నాథ రెడ్డి,జయ రామయ్య,శ్రీనివాసులు రెడ్డి,రామ కొండ రెడ్డి,సీ.కె.ఎర్రం రెడ్డి, దినేష్ రెడ్డి, నాగేశ్వర, వెంకట సిద్దులు,హర్ష రెడ్డి,రామ మోహన్, నాగ,గౌస్,జగదీష్ రెడ్డి,మహేష్ రెడ్డి, సుబ్బు,వేణు గోపాల్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శనేశ్వర స్వామి ఆలయం.





**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్18:**
పలమనేరు నియోజకవర్గం, వీ.కోట మండలంలోని నాయకనేరి ప్రధాన రోడ్డు పాపేపల్లి మిట్ట లక్ష్మీనారాయణ నగర్‌లో వెలసి ఉండు శ్రీశనీశ్వర ఆలయం నందు శనివారం రోజు శనిత్రయోదశి పురస్కరిం చుకొని భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. శని త్రయోదశి పురస్కరించుకొని ఆలయ అర్చకులు, లక్ష్మీనారాయణ రాజు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకములు, విశేష పూల అలంకరణతో స్వామి వారిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించినారు. అనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించినారు.

## నేషనల్ ఒలంపిక్‌కు వీకోట విద్యార్థి



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ వీకోట మండలం. జాతీయస్థాయిలో జరగబోయే క్రికెట్ ఒలంపిక్‌కు వి.కోట పట్టణం జై భీమ్ నగర్‌కు చెందిన ఎన్. శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ అనే విద్యార్థి అతి చిన్న వయసులోనే ఒలంపిక్ కు ఎంపిక కావడం పట్ల వీకోట మండలంలో కూటమి ప్రభుత్వం వారిచేత అతనికి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన వీకోట మండలంలోని వీకోట పట్టణం నుండి కార్తీక్ అనే విద్యార్థి నేషనల్ ఒలంపిక్ క్రికెట్కు ఎన్నిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేసినారు. రాబోవు రోజుల్లో కార్తీక్ మరింత ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని, అతని తల్లిదండ్రులక, కోచ్‌కు మరియు వీకోట పట్టణానికి మంచి పేరు తేవాలని మరియు అతనికి కావలసినటువంటి అన్ని సదుపాయాలను కూటమి ప్రభుత్వం నుండి అందించి అతను ముందుకు వెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు పలమనేరు శాసనసభ్యులు గార్ల ఆశీస్సులతో అన్ని విధాల మేము సహకరిస్తామని పలమనేరు మార్కెట్ మాజీ చైర్మన్ సి.రామచంద్ర నాయుడు హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమానికి కార్తీక్‌తో పాటు వారి తండ్రి ఎన్. శ్రీనివాసులు, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, క్లస్టర్ ఇన్చార్జ్ రాంబాబు, సింగల్ విండోబ్యాంక్ చైర్మన్ నారాయణస్వామి, శబరీష్, ధీరజ్, విశ్వేశ్వర, సోమశేఖర్ పాల్గొన్నారు.

Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143

# శ్రీకాళహస్తి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతి ఆడిటో రియంలో శనివారం మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, అధ్యక్షతన నిర్వహించిన వైఎస్ఆర్సిపి నియోజ కవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిధులుగా తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో నుండి, టౌన్ నుండి వైఎస్ ఆర్సిపి నేతలు కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ముందుగా గ్రామస్థాయి, వార్డు, మండల కమిటీల నియామకాలను ఎలా చేయాలనేది ఏవి ద్వారా వివరించిన వైయస్సార్సీపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చుట్టాల పై ఉద్యమం ఉధృతం చేసేందుకు గ్రామ స్థాయి, వార్డు, మండల కమిటీల నియా మకాలను త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అనుబంధ సంఘాల అధ్యక్షులు చర్యలు తీసుకోవా లని కోరారు. అక్రమ కేసులు అరెస్టుపై పోరాటం సాధించేందుకు జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి అక్రమాలను అడ్డుకుంటూ నకిలీ మద్యంపై ఉద్యమిస్తామని తెలిపారు అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమిష్టిగా పోరాటం చేస్తూ కార్యకర్తలకు అడుగడుగున అండగా నిలుస్తామన్నారు.కక్ష సాధింపు చర్యలకు భయపడేది లేదని నిరంకుశ పాలనకు మంగళం పాడే వరకు



విశ్రమించమని అన్నారు. ప్రజలకు సంక్షేమ అందించడమే అజెండాగా జగనన్న పాలన సాగిందని భవిష్యత్తులో వైఎస్ ఆర్సిపి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తుందని అన్నారు. అలాగే కార్యకర్తలకు పెద్దపీట వేస్తూ వారి పాత్ర ప్రత్యక్షంగా ఉంటుందన్నారు. జగనన్న చేసే యజ్ఞంలో మనం క్రియాశీల పాత్రదారులం కావాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రాన్ని దోచుకుంటుందని అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త అప్రమత్తగా ఉండాలని బూతు లెవల్లో నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. టిడిపి ఎల్లో మీడియా ,సోషల్ మీడియా చేస్తున్న ఈ గ్లోబల్ ప్రచారంను తిప్పి కొట్టాలన్నారు. రాబోయే జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యమని జగనన్న మాటగా గ్రామస్థాయిలో తీసుకువెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి జీవితమంతా నకిలీ మాటలే

### డా.యం.ఉమేష్ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
శ్రీకాళహస్తి నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయి, ప్రమాణాల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్న వైసిపి నాయకుల జీవితమంతా నకిలీ మాటలే అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు.నకిలీ మద్యం జే బ్రాండ్స్ కేసులో అడ్డంగా బుక్ అయిన జగన్, జోగి, జనార్ధన్ జే గ్యాంగ్ లింక్ బయట పడిందని, నకిలీ మద్యం కేసులో నిందితులు జనార్ధనరావు, అతని సోదరుడు జగన్మోహన్ రావులు ఎవరో నాకు తెలి యదు అని ఇన్నాళ్ళూ బుకాయించిన జోగి రమేష్ వారితో ఉన్న ఫోటోలతో అడ్డంగా దొరికిపోయాడని గుర్తు చేశారు. ఎదురు సందింటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆఫ్రికా నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు ప్రమాదకర సారా విస్తరించారని, అటు ఆఫ్రికాలో తన సోదరులు అనిల్ రెడ్డి, సునీల్ రెడ్డి, ఆంధ్రప్ర దేశ్‌లో జోగి రమేష్‌లకు ఈ డేంజర్ లిక్కర్ తయారీ, అమ్మకం బాధ్యతలను జగన్‌రెడ్డి అప్పగించడం నిజ మే కదా అని ప్రశ్నించారు. ఐదేళ్ల జగన్ పాలనలో కొత్త పరిశ్రమలు రాక, ఉన్న వాటిని జే టాక్స్ కోసం బెదిరించి తరిమేశారు. దీంతో రాష్ట్రమంతా పారిశ్రామిక విధ్వంసం జరిగింది. ఆర్థిక రాజధానిగా వెలగాల్సిన విశాఖలో వైసిపి పాలనా కాలంలో గుబులు మొదలైంది.చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువయ్యాక ఒక్కో పరిశ్ర మ ఏపీకి పరుగు పరుగున వస్తోందని, విశాఖకు ఏకంగా రూ.1.33 లక్షల కోట్ల అతి పెద్ద పెట్టుబడితో గూగుల్ తెచ్చా రని కొనియాడారు. మాజీ మంత్రి అమర్నాద్ నకిలీ మాటలు



మాట్లాడుతూ, ప్రతిదీ మా జగన్ పెట్టిన గుడ్డే అంటే, గుడ్డు పగులుతుంది అని హెచ్చరించారు. లోకేష్ చెప్పి నట్టు, మీకూ, మీ జగన్‌కు సబ్జెక్ట్ తెలియదు.కాబట్టి ఆవేశం తగ్గించుకొని మాట్లాడటం మంచిదని గుడ్డు మంత్రికి హితవు పలికారు. ప్రపంచ ప్రఖ్యాత సంస్థ గూగుల్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకునే ఏఐ హబ్‌లో ఏఐ ఆధారిత పరిశోధన, శిక్షణ, ఆవిష్కరణలు, స్టార్టప్ మద్దతు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు కాబట్టి, ఈ ప్రాజెక్టు ద్వారా వేలాదిమంది టెక్నికల్ విద్యార్థులు, ఇంజనీర్లు, పరిశోధకులు నేరుగా లాభపడతారు. ముఖ్యంగా గూగుల్ ఏఐ హబ్ ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్ అవుతుందని హర్షం వ్యక్తం చేశారు. మానవ వనరులు, సాంకేతిక, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ఏపీ నాయకత్వాన్ని ప్రశం సించిన ఆస్ట్రేలియా ప్రభుత్వం..ఈ మేరకు స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ని ఆహ్వానించిందని, ఇందులో భాగంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న నారాలోకేష్ పర్యటన ఫలప్రదం కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్య నిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకుడు చిల్లకూరు మణి తదితరులు పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18:**
శ్రీకాళహస్తి రాచగున్నెరి ప్రాథమిక పాఠశాలలో విజయ వాహని చారిటబుల్ ఫౌండేషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం డ్రాయింగ్ పోటీలు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించారు. పాట్నాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమని తెలిపారు విజయవహన్ని ఫౌండేషన్ కోఆర్డినేటర్ లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు తరువాత మలవిసర్జనకు తర్వాత చేతులు సబ్బుతో పరిశుభ్రంగా శుభ్రం చేసుకోవాలని గోళ్లు పెరగకుండా తరచుగా శుభ్రం చేసుకోవాలని కట్ చేసుకోవాలని తెలిపారు. సబ్బుతో చేతులు పరిశుభ్రం చేసుకునే పద్ధతులు డెమో ద్వారా చేసి చూపించారు. విద్యార్థులకు చేతుల పరిశుభ్రత ఆరోగ్యం పై డ్రాయింగ్ వకృత్వ పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీగా టపాకాయల దుకాణాలు.




**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
వీ.కోట దుర్గానగర్ సమీపంలో భారీగా టపాకాయల దుకాణాలను నెలకొల్పినారు. దీపావళి పండుగను పురస్కరించుకొని వ్యాపారస్తులు దుకాణాలను భారీగా నెలకొల్పి వ్యాపారస్తులను ఆకట్టుకునేందుకు విద్యుత్ దీప కాంతులతో ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా కొనుగోల దారులను విచారించగా ధరలు అధికంగా ఉన్నందువలన ఎక్కువ కొందామనుకున్న కొనలేక, తక్కువ పరిమితంతో టపాకాయలు కొంటున్నామని వినియోగదారులు తెలియజేసినారు.

## కోచ్ అవినాష్ రెడ్డికి ఘన సన్మానం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
అన్నమయ్య జిల్లా పీలేరుతిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో శుక్ర వారం జరిగిన వెంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాల క్రీడల్లో పాల్గొని సత్తా చాటిన సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కోచ్‌గా వ్యవహరించిన అవినాష్ రెడ్డిని కళాశాల కరస్పాండెంట్ చింతల విజయ భాస్కర్ రెడ్డి ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య సత్కరించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చి యూనివర్సిటీ రాష్ట్ర, దేశీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విజయం సాధించేదిగా కృషి చేస్తున్నందుకు అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని గెలిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది విద్యార్థులు ఆదిసగా అడుగులు వేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన ప్రమాదం ప్రయాణికులు క్షేమం.

**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**



పలమనేరు నియోజకవర్గం వి.కోట పట్టణం పంచాయతీ బస్టాండ్‌లో శనివారం రోజు సాయంత్రం సుమారు 6 గంటల ప్రాంతంలో కర్ణాటక ఆర్టీసీ బస్సును బస్ డ్రైవర్ బస్సును ముందుకు నడిపే క్రమంలో వేమారుపాటున రివర్స్ గేర్‌లో ఉన్న బస్సును యాక్సిలేటర్ పెంచడంతో బస్సు వెనక్కి వెనక్కి వెళ్లి బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల ప్రాంగణాన్ని బలంగా ఢీకొన్నది. ఈ ప్రమా దంలో బస్సు వెనక వైపు అద్దాలు పూర్తిగా ధ్వంసం కాగా, ఆ సముదాయం కింద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయా ణికులు అప్రమత్తమై పరుగులు తీయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు, దేవుడా గండం గడిచిందని ఊపిరి పీల్చుకు న్నారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

# ఫ్యూచర్ లీడర్ లోకేష్ నా...



**విజయవాడ:** చంద్రబాబు తర్వాత ఎవరు.. ఈ ప్రశ్నకు టీడీపీలో అయితే ఆన్సర్ వెంటనే వస్తుంది నారా లోకేష్ అని..! మరి కూటమి ప్రభుత్వంలో ఎవరు..? అది చెప్పడం కొంచం కష్టం.. అయితే ఆ కష్టాన్ని ప్రధాని మోదీ ఈజీ చేస్తున్నారా.. ? నారా లోకేష్‌ను ఫ్యూచర్ లీడర్‌గా రెడీ చేస్తున్నారా..?ఏపీలో ఎన్నికలు కొత్త 'సన్‌రైజ్'ను తీసుకురావచ్చు, కానీ 'సన్ సెట్' కూడా జరుగుతుంది" అని మోదీ చంద్రబాబు, లోకేష్‌లను ఉద్దేశించి విమర్శించారు. ఇక్కడ సన్‌సెట్ అంటే నారా లోకేష్ రాజకీయ భవితవ్యం ఆ ఎన్నికలతో ముగిసిపోతుందన్నది మోదీ మాటల అంతరార్థం అదే నరేంద్రమోదీ .. అదే కర్నూలులో ఇప్పుడు ప్రధానిగా అధికారిక హోదాలో నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. అవసరానికి మించి ఎలివేషన్ ఇస్తున్నారు. చిన్నబాబుతో ప్రత్యేక సమావేశాలు.. ఆయన్ను ప్రత్యేకంగా పొగడటాలు.. ట్వీట్‌లలో ప్రత్యేక ప్రస్తావనలు..వీటన్నింటి ద్వారా ప్రధాని మోదీ నారా లోకేష్ ఫ్యూచర్ లీడర్ అన్న సంకేతాలు ఇస్తున్నారా..?ప్రస్తుతానికి ఇది అప్రస్తుతమే కానీ? ఓ చర్చ అయితే పార్టీలో నడుస్తుంటుంది కదా.. టీడీపీలో అయితే దీనిపై పెద్దగా ఆలోచించడానికేం ఉండదు.. చంద్రబాబు తర్వాత లోకేషే.. ! అయితే పార్టీలో పొజిషన్ కాకుండా.. ప్రభుత్వంలో పొజిషన్ గురించి మాట్లాడుకున్నప్పుడు దీనికి ఆన్సర్ చెప్పడం అంత సులభం కాదు. పైగా చంద్రబాబు యాక్టివ్‌గా ఉన్నంత కాలం ఆయన నాయకత్వమే ఉండే అవకాశం ఉంటుంది. ఏపీలో బీజేపీ మైనర్ పార్టీ కాబట్టి.. ఈ కూటమిలో కీలకంగా ఉన్న జనసేన, బాగా పాపులారిటీ ఉన్న జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా లోకేష్ కు పోటీదారు అవుతారు. అయితే ఈ డిస్కషన్ రాకుండా చేసేందుకు రెండు పార్టీల నేతలు ఈ చర్చను రానివ్వరు. పైగా పవన్ కల్యాణ్ చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వంలో ఇంకో 15 ఏళ్లు ఉండాలని పలు సందర్భాల్లో చెప్పారు. లోకేష్ కూడా తన రాజకీయ భవితవ్యంపై చర్చ రాకుండా జాగ్రత్త పడతారు.. కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం జరిగిన విషయాన్ని గుర్తుచేసుకుంటే.. అప్పట్లో పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుంది. ప్రమాణ స్వీకార వేదికపై పవన్‌ను ప్రత్యేకంగా పక్కకు పిలవడం? ఆ తర్వాత అమరావతి 2.0 కార్యక్రమంలోనూ పవన్ కు ప్రాధాన్యత ఇవ్వడం? మరో సందర్భంలో ఆయన్ను పెనుగాలిగా అభివర్ణించారు. ఇప్పటికీ పవన్ కల్యాణ్ పట్ల ఆ ప్రత్యేకమైన అభిప్రాయం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో లోకేష్ ఢిల్లీ స్థాయిలో రైజ్ అయ్యారు.

కూటమిలో కీలకంగా ఉన్నప్పటికీ జాతీయ స్థాయిలో మాత్రం లోకేష్ లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేసేవారు. అయితే విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం తర్వాత లోకేష్ రేంజ్ పెరిగింది. గిన్నీస్ రికార్డ్ స్థాయిలో దాని నిర్వహణ విషయంలో లోకేష్ చూపిన చొరవను ప్రధాని గుర్తించారు. వేదిక మీదనే ప్రత్యేక స్థానాన్నిచ్చారు. ఆ తర్వాత వచ్చి తనను కలవాలంటూ పిలిచారు. ప్రధాని ఆహ్వానం మేరకు లోకేష్ కుటుంబంతో సహా వెళ్లి మోదీని కలిశారు. ఆయనతో కలిసి దాదాపు గంటన్నర సేపు డిన్నర్ మీటింగ్ చేశారు. అప్పటి నుంచే మోదీతో లోకేష్ అటాచ్‌మెంట్ పెరిగింది. ఆ తర్వాత లోకేష్ ఢిల్లీ వెళ్లడం కూడా పెరిగింది. చాలామంది కేంద్రమంత్రులను తరుచూ కలుస్తున్నారు. గుగూల్ ను విశాఖకు రప్పించడంతో ఆయన ఖ్యాతి అమాంతం పెరిగిపోయింది. ప్రధాని సహకారం లేకుండా ఇది జరిగే అవకాశం లేదు. యోగాంధ్ర సక్సెస్ గురించి ఆయన కేంద్ర కేబినెట్‌లో మాట్లాడారు. నిన్న కర్నూల్ పర్యటన తర్వాత.. ట్వీట్ చేసిన ప్రధానమంత్రి? ప్రత్యేకంగా లోకేష్‌ను మెన్షన్ చేశారు. దీనిని బట్టే ఆ ట్వీట్‌కు ఉన్న ప్రాధాన్యత తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా చెప్పడానికి లోకేష్ ఏమీ ముఖ్యమంత్రి కాదు కదా? లోకేష్‌కు ఆ స్థాయి ఎలివేషన్ ఇవ్వడానికి ప్రధానికున్న ప్రధానమైన కారణం ఏంటి.ఈ ఎన్నికల్లో అప్రతిహత విజయంతో కూటమి ఏపీలో తిరుగులేని స్థానంలో ఉంది కానీ.. 2019కి ముందు పరిస్థితి వేరు. ప్రధాని హోదాలో నరేంద్ర మోదీతో సహా.. బీజేపీ మొత్తం లోకేష్‌ను కూడా టార్గెట్ చేసింది. అంటే 2019కి ముందు నారా లోకేష్ పై ప్రధాని మోదీకి తీవ్రమైన వ్యతిరేకత భావం ఉంది. వారసత్వంగా వచ్చి ప్రజలపై పెత్తనం చేయాలనుకుంటున్నారని భావనకు వచ్చారు. సమర్థత ఉన్న వారసులను ప్రోత్సహించడానికి మోదీ వెనుకాడరు. కానీ ప్రజలపై బలవంతంగా రుద్దితేనే వ్యతిరేకిస్తున్నారు. లోకేష్ విషయంలో అప్పట్లో ఆయన అదే ఫీల్ అయ్యారని ప్రచారసభల్లోని మాటలను బట్టి అర్థమైపోతుంద ఆ తర్వాత ఐదేళ్లకు పరిస్థితులు మారాయి. 2024లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈ కూటమి కట్టడంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపారని.. బీజేపీని టీడీపీని కలపడానికి తన వంతు కృషి చేశారని జనసేన నేతలు .. పవన్ కల్యాణ్ కూడా చెబుతుంటారు. దానికి తగ్గట్లుగా ప్రధాని ఆయనకు ప్రాధాన్యం కూడా ఇచ్చారు. "రాష్ట్రవ్యాప్తంగా 'సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్' ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. సృజనాత్మక పోటీల ద్వారా, యువతలో జీఎస్టీ పట్ల అవగాహన పెంచగలిగారు.." అని అభినందించారు. ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. ఇటీవలి కాలంలో ప్రధాని మోదీ .. నారా లోకేష్ పై ప్రత్యేకమైన అభిమానం చూపిస్తున్నారు. వ్యక్తిగత అంశాలపైనా సలహాలు ఇస్తున్నారు. కర్నూలులో హెలికాప్టర్ వద్ద ఆహ్వానం పలికినప్పుడు బాగా బరువు తగ్గావు అని లోకేష్‌ను అభినందించారు. లోకేష్ పై ప్రధాని మోదీ.. కూటమిలో పార్టీ నేత అయినందునే అభిమానం చూపిస్తున్నారని అనుకోలేము. వారసుడు అనే వ్యతిరేకతను మోదీ తుడిచేసుకున్నారని ఆయన సామర్థ్యాన్ని గుర్తించారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. చంద్రబాబు తర్వాత లోకేష్ నాయకత్వాన్ని అన్ని రకలుగా మోదీ గుర్తిస్తున్నారా అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. జరుగుతన్న సంఘటనలు దానిని బలపరుస్తున్నాయి కూడా.,!ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూడాలి. పొత్తులతో పార్టీలను నడుపుతున్నప్పుడు.. మిత్రుల మనోభావాలను పట్టించుకోవాలి. పవన్ కల్యాణ్ నిర్ద్వందంగా చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థిస్తున్నారు. ఇంకో 15 ఏళ్లైనా ఆయన నేతృత్వంలో పనిచేయడానికి సిద్ధమే అన్నట్లు మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ అలా అంటున్నారుని కానీ.. ఆయన పార్టీ క్యాడర్ మాత్రం ఆయన్ను ఎప్పుడు సీఎంగా చూద్దామా అన్న ఆతృతలో ఉంది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు వారికి నచ్చడం లేదు కూడా .. ఇక్కడ ఇంకో విషయం జాగ్రత్తగా చూస్తే.. పవన్ చంద్రబాబు నాయకత్వాన్ని అన్నారు కానీ.. టీడీపీ నాయకత్వం అనలేదు. అంటే టీడీపీలో ఎవరైనా అని చెప్పలేదు. అదే సమయంలో లోకేష్‌పైన వ్యతిరేకత కూడా వ్యక్తం చేయలేదు. ఆయనతో చాలా సోదర, సుహృద్భావ రిలేషన్‌ను కొనసాగిస్తున్నారు. అంతేకాదు.. మరికొన్ని మంత్రిత్వ శాఖలను లోకేష్ నిర్వహించగలరు అని చెప్పడం ద్వారా ఆయన కూడా లోకేష్‌కు ఎలివేషన్ ఇస్తున్నట్లే అనుకోవచ్చు. ప్రస్తుతానికి అమరావతి, పోలవరం, విశాఖ ఆర్థిక రాజధాని, రాయలసీమ ఇండస్ట్రియల్ కేపిటల్ అనే స్పష్టమైన ఫోకస్‌తో కూటమి నడుస్తోంది. చంద్రబాబు నాయకత్వం విషయంలో కూటమిలో వాళ్లకు ఇసుమంతైనా వ్యతిరేకత లేదు. కాకపోతే.. ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు.. ప్రధాని స్థాయి వాళ్లు స్పందనలు లోకేష్ ప్రాధాన్యతను పెంచాయి. అందుకే ఆయన ఫ్యూచర్ లీడర్ అనే చర్చకు దారితీశాయి.

===========

## జగన్ కుట్రలను తిప్పి కొట్టాలి..

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు మాట్లాడారు కదా.. మాకెందుకులే అనుకొని పార్టీ నేతలు ఉంటే సరిపోదన్నారు. కూటమి ప్రభుత్వంపై జగన్ చేస్తున్న విష ప్రచారాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తేల్చి చెప్పారు. పార్టీ నేతలు సైతం మీడియా ద్వారా జగన్ అసత్య ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జోగి రమేష్‌ను మద్యం స్కామ్‌లో ఇంకా అరెస్టు చేయలేదనే చర్చ జరుగుతుందని సీనియర్ నేతలు సీఎం వద్ద ప్రస్తావించారు. మద్యం అంశంలో సిట్ విచారణ కొనసాగుతున్నందున.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చంద్రబాబు వారితో అన్నట్టు సమాచారం. గూగుల్ డేటా సెంటర్ విశాఖకు రావడం పట్ల సీనియర్ నేతలు చంద్రబాబుని అభినందించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై జగన్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించాలని చంద్రబాబు సూచించారు. "ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవడంలో మంత్రులతో పాటు పార్టీ నేతలు కూడా సమాంతరంగా పనిచేయాలి. జగన్ చేస్తున్న అబద్ధాలను మీడియా ముఖంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది" అని ఆయన నేతలకు ఉద్బోధించారు. ఇదే సమావేశంలో మాజీ మంత్రి జోగి రమేశ్ పై నమోదైన మద్యం కుంభకోణం కేసు ప్రస్తావనకు వచ్చింది. ఆయనను ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని కొందరు సీనియర్ నేతలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, మద్యం కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కొనసాగుతోందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టత ఇచ్చారు. దర్యాప్తులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదని ఆయన హామీ ఇచ్చినట్లు సమాచారం. మరోవైపు, విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంపై నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇంత పెద్ద ప్రాజెక్టును తీసుకువచ్చినందుకు వారు ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వర్ల రామయ్య సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం సూత్రధారులు, పాత్రధారులకు చుక్కలు చూపిస్తాం

**అమరావతి:** కల్తీ మద్యంలో సూత్రధారులు, పాత్రధారులందరికీ చుక్కలు చూపిస్తామని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మద్య నిషేధం అమలు చేశాకే 2024లో ఓట్లు అడుగుతామని చెప్పి.. కల్తీ మద్యం అమ్మిన నీచ చరిత్ర వైకాపాదని ధ్వజమెత్తారు.




పేర్ని నానికి మతి భ్రమించి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. రూ.99 బ్రాండ్లు నిలిపివేశామనడం అతని అజ్ఞానానికి నిదర్శనమని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు ఎవరి హయాంలో లేకుండా చేశారో ప్రజల్ని అడిగితే చెబుతారన్నారు. ఇండెంట్ ప్రకారమే మద్యం సరఫరా చేస్తారనే కనీస జ్ఞానం లేదా?అని ప్రశ్నించారు. గత ఐదేళ్లు కల్తీ మద్యం అమ్మిందెవరో ప్రజలు గుర్తించే వైకాపాను తరిమికొట్టారని తెలిపారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం ఘటనల విచారణ పారదర్శకంగా జరుగుతోందని వెల్లడించారు. సిట్ విచారణను కూడా తప్పుదోవ పట్టించేలా వైకాపా సోషల్ మీడియా కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా నేతల ప్రోత్సాహంతోనే కల్తీ మద్యం తయారు చేసినట్లు జనార్ధనరావు అంగీకరించాడన్నారు. ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకే కల్తీ మద్యం తయారు చేసినట్లు అంగీకరించాడని వ్యాఖ్యానించారు. హెూలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానం 2014-19లోనే తీసుకొచ్చామని గుర్తు చేశారు.

## బీజేపీకి ఒక మతాన్ని అంటకట్టడం కరెక్ట్ కాదు

అమరావతి, అక్టోబర్ 18: బీజేపీ పార్టీకి ఒక మతాన్ని అంటకట్టడం కరెక్ట్ కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. తిరుపతి పట్టణంలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వధర్మ సమభావన, హైందవ ధర్మం నిత్యనూతనమనేది బీజేపీ నినాదమని స్పష్టం చేశారు. లోకాకళ్యాణార్థం.. అన్ని వర్గాల ప్రజల క్షేమం కోసం దేశవ్యాప్తంగా యాగాలు నిర్వహిస్తామని చెప్పారు. వివక్ష గురవుతున్న సమాజంలో వారి గుర్తింపు, గౌరవాన్ని పెంచుతామని చెప్పారు. క్షురకులు అంటే సమాజంలో చిన్నచూపు ఉందని.. నాయిబ్రాహ్మణులు బలహీనులు కాదు, బలవంతులని తెలియచెప్పడమే బీజేపీ ఉద్దేశ్యమని తెలిపారు సంజీవిని, స్వరం కార్యక్రమాన్ని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ప్రకటించారు. నాయిబ్రాహ్మణులకు నాదస్వరం, ధన్వంతరి ఆయుర్వేదం రెండూ తెలుసు అని వ్యాఖ్యానించారు.

## ఈ ఏడాది కూడా ప్రయాణంలోనే దీపావళిని జరుపుకోవాల్సి వస్తోంది

-మొదటిపేజీ తరువాయి

ఇక్కడ పర్యటించనున్నాను. ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం మన యువతకు అంతర్జాతీయ స్థాయిలో కొత్త అవకాశాల ద్వారాలు తెరవడమే. ఇందులో భాగంగా ఆస్ట్రేలియాలోని ప్రముఖ యూనివర్సిటీల అధిపతులు, టాప్ కంపెనీల సీఈఓలు, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రులతో సమావేశం కాబోతున్నాను. ఈ చర్చల ద్వారా మన రాష్ట్ర యువతకు ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ఒక మార్గం సుగమం చేయాలనేది నా సంకల్పం. అదే సమయంలో, అమెరికా టారిఫ్‌ల కారణంగా ఇబ్బందులు పడుతున్న మన సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులకు అండగా నిలవాలనుకుంటున్నాను. వారికి కొత్త మార్కెట్లను అన్వేషించేందుకు ఆస్ట్రేలియన్ సీఫుడ్ అసోసియేషన్‌తో ప్రత్యేకంగా సమావేశమై చర్చిస్తాను. అలాగే, ఇక్కడ ఎంతో ఉత్సాహంగా ఉండే మన తెలుగు ప్రవాసులతో కూడా కాసేపు సమయం గడపనున్నాను. వారి ఆలోచనలు, సలహాలు నాకు ఎప్పుడూ కొత్త శక్తిని ఇస్తాయి. ఈ ఏడాది కూడా సీఐఐ రోడ్‌షో కారణంగా దీపావళిని ప్రయాణంలోనే జరుపుకోవాల్సి వస్తోంది. కానీ, ఈ పర్యటన విజయవంతమై కొన్ని ఆస్ట్రేలియా కంపెనీలు మన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే, మన ప్రజలకు అంతకంటే విలువైన పండుగ బహుమతి మరొకటి ఉండదు. అదే నేను కోరుకునే అసలైన పండుగ" అని లోకేశ్ వివరించారు.

నాయుడు అంత తేలికగా మోపిదేవిని నమ్మే అవకాశం లేదు. రాజ్యసభ పదవి త్యాగం చేసినందుకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశముంది. అదీ ఒక్క ఛాన్స్ వరకూ మాత్రమే అన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. వైసీపీలో ఉన్న సమయంలో ఓడిపోయినా మంత్రిని చేసి, తర్వాత అనుకోని పరిస్థితుల్లో రాజ్యసభ పదవికి ఎంపిక చేసిన పార్టీని కాదని మోపిదేవి వెంకటరమణ సైకలెక్కి ఇప్పుడు బాధపడితే ప్రయోజనం ఏముంటుంది?

## చెక్కునత్తం సచివాలయంలో ఆయుధపూజ కార్యక్రమం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 18:**



కుప్పంమండలం చెక్కునత్తం సచివాలయంలో శనివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో దేవతామూర్తుల చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, స్థానిక నాయకులు బీరప్ప, మునిరత్నం, తిమ్మప్ప, బాలు, వెంకటాచలం, రమేష్, పంచాయతీ కార్యదర్శి మురళి, పారిశుధ్య కార్మికులకు స్వీట్ బాక్సు పంపిణీ చేశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ హబ్ గా కర్నూలు




**కర్నూలు :** కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో 300 ఎకరాల్లో ఈ డ్రోన్ హబ్ ఏర్పాటు కానుంది. ఇక్కడ విమానాశ్రయం, ఫ్లై జోన్ ఉండటం కారణంగానే ప్రభుత్వం ఓర్వకల్లులో ఈ హబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అయితే, అందరూ అనుకున్నట్లు ఇది కేవలం డ్రోన్ తయారీ కేంద్రం కాదు. ఇది డ్రోన్‌కు సంబంధించి అన్ని విషయాలకు సమగ్ర కేంద్రంగా నిలవనుంది.ఈ హబ్‌లోనే తయారు చేస్తారు. తయారు చేసిన డ్రోన్లను అన్ని విధాలా పరీక్షించే సదుపాయాలు కల్పిస్తారు. అంతే కాకుండా, వివిధ రకాల సాంకేతికతలను కలబోసి కొత్త తరం డ్రోన్ల తయారీ కోసం పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాలను ఈ డ్రోన్ హబ్‌లో ఏర్పాటు చేస్తారు. దీంతో పాటు డ్రోన్ల మరమ్మతులు స్టేషన్స్ ఉంటాయి. ఇక డ్రోన్లకు అవసరమైన సర్టిఫికేషన్ (ధృవీకరణ) వంటి సదుపాయాలన్నీ ఇక్కడ లభిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించడమే ఈ డ్రోన్ హబ్ ముఖ్య లక్ష్యం.కర్నూలులోని ఓర్వకల్లులో ఏర్పాటు చేసే డ్రోన్ హబ్‌కు ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద కామన్ డ్రోన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇది తయారయిన డ్రోన్ల నాణ్యతకు హామీకి, సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతుంది.ఇక్కడ డ్రోన్లను తయారు చేయడమే కాదు. వీటిని ఆపరేట్ చేసే డ్రోన్ పైలట్‌లు, టెక్నీషియన్లు, ఇంజనీర్లను తయారు చేయడానికి శిక్షణా అకాడమీలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు నెలకొల్పుతారు. దీని ద్వారా పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.ఓర్వకల్లు ప్రాంతం కర్నూలు విమానాశ్రయం, జాతీయ రహదారులకు అనుకూలంగా ఉండటమే కాకుండా, హైదరాబాద్-బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అనుకూలంగా ఉంటుంది. డ్రోన్ హబ్ ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోనున్నాయి.

కర్నూలులో ఈ డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుంది. అయితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డ్రోన్ పాలసీ ద్వారా సుమారు వేయి కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రానున్న ఐదేళ్లలో దాదాపు 3 వేల కోట్ల రాబడి వస్తుందని అంచనా. అయితే, ఈ డ్రోన్ సిటీలో ఇప్పటికే డ్రోన్ రంగంలో మంచి పేరున్న సంస్థ గరుడ ఏరోస్పేస్ వంద కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. డ్రోన్ల తయారీ, మరమ్మతులకు సంబంధించిన డ్రోన్-యాజ్-ఎ-సర్వీస్ అందించే అనేక దేశీయ, విదేశీ కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. దీంతో అనేక దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ పెట్టుబడులను ఈ డ్రోన్ సిటీలో పెట్టేందుకు చర్చలు ప్రారంభించాయి.

పెరగనున్న ఉపాధి అవకాశాలు

డ్రోన్ హబ్ ద్వారా భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ 40 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. అంతే కాకుండా, ఇక్కడ ఏర్పాటు చేసే నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా 25 వేల మందికి డ్రోన్ పైలట్‌లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి లభిస్తుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న

## ఆర్టీసీ అంగడి రూముల అగ్రిమెంటు రద్దు చేయాలి



**పీలేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18:**
అన్నమయ్య జిల్లా పీలేరు ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అంగ డులలో ఇతరవ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆ రూముల అగ్రిమెంట్లను రద్దు చేయాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపా ధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, ఆర్టీసీ డిపోమేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం వందలా ది మంది విద్యార్థులు పీలేరు ఆర్టీసీ బస్టాండ్ కేంద్రంగా వివిధ గ్రామాలకు, పట్టణాలకు ప్రయాణాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తినుబండారాలు, ఇతర అవసరమైన వస్తువులు అధిక ధరలకు విక్రయించడం, విద్యార్థులు, సాధారణ ప్రజలపై భారమవుతోంది అని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో పారిశుధ్యం లేకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని బస్టాండ్ పరిసరాల్లో స్వచ్ఛతను కాపాడేందుకు అధికారులు క్రమం తప్పకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సాయిసంపత్ కుమార్, ఇంతియాజ్, శివ, నాయుడు పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18:**
శ్రీకాళహస్తి రాచగున్నేరి ప్రాథమిక పాఠశాలలో విజయ వాహని చారిటబుల్ ఫౌండేషన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం డ్రాయింగ్ పోటీలు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించారు. పాట్నాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమని తెలిపారు విజయవహన్ని ఫౌండేషన్ కోఆర్డినేటర్ లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు తరువాత మలవిసర్జనకు తర్వాత చేతులు సబ్బుతో పరిశుభ్రంగా శుభ్రం చేసుకోవాలని గోళ్లు పెరగకుండా తరచుగా శుభ్రం చేసుకోవాలని కట్ చేసుకోవాలని తెలిపారు. సబ్బుతో చేతులు పరిశుభ్రం చేసుకునే పద్ధతులు డెమో ద్వారా చేసి చూపించారు. విద్యార్థులకు చేతుల పరిశుభ్రత ఆరోగ్యం పై డ్రాయింగ్ వకృత్వ పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## హాకీ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన భవిష్ రాజ్



**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 18:**
వీ.కోట మండల కేంద్రమైన వీకోటకు చెందిన భవిష్ రాజ్ జిల్లాస్థాయిలో జరిగిన ఎస్ జి ఎఫ్ఐ (స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) హాకీ క్రీడా పోటీలలో వీకోట నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థి భవిష్ రాజ్ ఉత్తమ ప్రతిభ కనపరిచారు. చంద్రగిరిలో ఈనెల 17న జరిగిన హాకీ పోటీలలో వీకోట నారాయణ పాఠశాలకు చెందిన భవిష్య రాజ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు వారికి నచ్చిన ఇతర అంశాలపై కూడా ప్రతిభ కనపరచడం అభినందనీయమని పుర ప్రముఖులు విద్యార్థికి అభినందనలు తెలిపారు. ఈ పోటీలతో విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎంతగానో దోహద పడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి భవిష్ రాజ్‌కు నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం పని కుమార్, మండల విద్యాశాఖ గారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ గీత శుభాకాంక్షలు తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
శ్రీకాళహస్తి పట్టణ మునిసిపాలిటీ కమిషనర్ భవాని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానం నందు తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుర్రప్ప శెట్టి, డీవీ నారాయణ, కిట్టు, ఆర్ముగం, సాజిద్, సతీష్, రమణయ్య, పురపాలక సంఘం అధికారులు పాల్గొన్నారు.

## చెక్కునత్తం సచివాలయంలో ఆయుధపూజ కార్యక్రమం



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 18:**
కుప్పంమండలం చెక్కునత్తం సచివాలయంలో శనివారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో దేవతా మూర్తుల చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తంమణి, స్థానిక నాయకులు బీరప్ప, ముని రత్నం, తిమ్మప్ప, బాలు, వెంకటాచలం, రమేష్, పంచాయతీ కార్యదర్శి మురళి, పారిశుధ్య కార్మికులకు స్వీట్ బాక్సు పంపిణీ చేశారు. వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతాంధ్ర పండితులు జన్నాభట్ల

## ఇక లేరు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



**గుంటూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18:**
సంస్కృతాంధ్ర పండితులు, రంగస్థల నటులు జన్నాభట్ల లక్ష్మీనారాయణ (65) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై అకాల మరణం చెందారు. ఈయనకు సతీమణి, ముగ్గురు కుమారులు వున్నారు. ఒక వియ్యంకుడు శ్రీనివాస్ నకరికల్లులో 30 ఏళ్లకు పైగా జర్నలిజంలో కొనసాగుతున్నారు. కాగా, జన్నాభట్ల ద్విచక్రవాహనంపై వినుకొండ నుంచి వస్తుండగా, నర సరావుపేట సమీపంలో సాయంత్రం 5 గంటలకు రోడ్డు ప్రమాదానికిగురయ్యారు. చికిత్స కోసం పలు ఆసు పత్రులకు తీసుకెళ్లినా, ఫలితం లేకపోయింది. రాత్రి 9 గంటల సమయంలో ఆయన కనుమూ శారు. స్వస్థలం నూజెండ్లలో శనివారం అంత్యక్రియలు జరిగాయి. ప్రకాశం జిల్లా తిమ్మసము ద్రంలోని శ్రీ గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాలలో తామిద్దరం కలిసి భాషాప్రవీణ ఐదేళ్ల కోర్సు పూర్తిచేశామని చెబుతూ, ఆ కళాశాల విద్యార్థి సంఘం పూర్వ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు ఆయన అకాల మరణం పట్ల తీవ్రవిచారం వ్యక్తపరిచారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. నరసరావుపేటలోని వివిధ విద్యా సంస్థల్లో మూడు దశాబ్దాలకు పైగా సంస్కృతాంధ్ర పండితులుగా పనిచేసిన జన్నాభట్ల, పౌరోహి త్యంలో క్షణం తీరికలేకుండా కాలం గడుపుతున్నారు. కొంత కాలం ఆయన నాగార్జున విశ్వ విద్యాలయం సెనేట్ సభ్యునిగానూ పని చేశారు. రంగస్థల నటునిగా వివిధ పాత్రలకు జీవం పోయటం ద్వారా గొప్ప నటునిగా పేరొందారు. పట్టణ కళాకారుల సంఘంలో వివిధ పదవుల్లో అనేకానేక మంది పేద కళాకారులకు ఆయన పింఛన్లు మంజూరు చేయించారంటూ నిమ్మరాజు నివాళులర్పించారు.

## విద్యార్థులతో కలిసి పరిశ్రమల సందర్శన




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
కుప్పం మండలం పరిధిలోని పరమ సముద్రం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల విద్యార్థులు స్థానిక ఆహార పరిశ్రమను సందర్శించారు. ఇందులో భాగంగా పాలను నిల్వ చేసే పద్ధతుల గురించి విద్యార్థులకు ఒకేషనల్ ట్రైనర్ సాయి కుమారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతిపురంలో ఉన్న స్థానిక హెరిటేజ్ పాల డైరీని సందర్శింపజేసి విద్యార్థులకు పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం .విజయలక్ష్మి, వృత్తి విద్యా నిపుణురాలు సాయి కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

### ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో

## కాలుష్య నివారణ పై అవగాహన




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టో 18:**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పంలో ప్రతినెల మూడవ శనివారం రోజున స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఎల్ .బి. ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా కె.వి చిదంబరం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... కళాశాల ఆవరణలో కాలుష్య నివారణ కొరకు విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతరులకు నెలలో ఒకరోజు ద్విచక్ర వాహనాలు కళాశాలకు తీసుకురాకుండా రావాలని హితవు పలికారు. అదేవిధంగా కళాశాల ఆవరణలో వివిధ రకాల చెట్లను 140 కి పైగా చెట్లను నాటి విద్యార్థులు చెట్లకు నీళ్లు పోయడం జరిగింది. కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తూ కళాశాల ఆవరణాన్ని శుభ్రపరచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి నారాయణమూర్తి, బాలకృష్ణ, ఎల్లప్ప, బి పి సుబ్రహ్మణ్యం తదితర అధ్యాపక అధ్యాపకేతరులు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## స్వర్ణంద్ర స్వచ్ఛంద్రపై ర్యాలీ, ప్రతిజ్ఞ



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**
పెనుమూరు బస్టాండ్ వద్ద "స్వర్ణంధ్ర స్వచ్ఛంద్ర" కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్ రావు పాల్గొని ప్రజలకు స్వచ్ఛత ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి గ్రామం, పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన సమాజం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

### బంగారు ఆభరణాలను రికవరీ, డి.ఎస్.పి పార్థసారధి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 18:**
రామకుప్పం, వి.కోట మండలాల పరిధిలో చోరీలకు పాల్పడ్డ అంతర్రాష్ట్ర దొంగ గాడ్విన్ మోహన్ రాజేంద్రన్ (35) ను కుప్పం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కారుతో పాటు 125 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు డిఎస్పి పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం ఆంబురు కు చెందిన గాడ్విన్ మోహన్ రాజేంద్రన్పై తమిళనాడులో 30కు పైగా దొంగతనం కేసులు ఉన్నాయని అన్నారు. తమిళనాడులో 30కు పైగా చోరీలకు పాల్పడ్డ అంతర్రాష్ట్ర దొంగ గాడ్విన్ మోహన్ రాజేంద్రను పట్టుకున్న కుప్పం రూరల్ పోలీస్ సిబ్బంది, క్రైమ్ పోలీసులకు డిఎస్పీ పార్థసారథి క్యాష్ రివార్డులు అందజేశారు. కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం, గుడిపల్లి, రాళ్లబూదుగురు ఎస్సైలు వెంకట మోహన్, శ్రీనివాసులు, నరేష్ తో పాటు పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ క్యాష్ రివార్డులు అందజేశారు. ప్రజలు తమకు చెందిన విలువైన నగలు, డబ్బులను బ్యాంక్ లాకర్ నందు భద్రపరచుకోవాలని అదేవిధంగా ఇంటి దగ్గర సిసి కెమెరాలు అమర్చి, స్మార్ట్‌లాక్‌లు వినియోగిస్తూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడిన వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరడమైనది.

### మున్సిపల్ కార్యాలయంలో

## ఘనంగా ఆయుధపూజ కార్యక్రమం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 18:**



కుప్పం మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఘనంగా ఆయుధ పూజకార్యక్రమం నిర్వహించారు. కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు, జాకీర్, సోము, హంస సోమ శేఖర్, గణపతి, ఎమ్ ఆర్ సురేష్, సురేష్, మాజీ ఎంపిటిసి ఉమాపతిలు హాజరయ్యారు. పూజకార్యక్రమం అనంతరం కుప్పం మున్సిపల్ స్టాఫ్‌కు స్వీట్ బాక్స్‌లు ఇచ్చారు. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాలలో ఆనందం, ఐశ్వర్యం, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పాలిటీ స్టాఫ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

### బిజెపి, రెస్కో డైరెక్టర్ తులసి నాథ్

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 18: .**



స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కుప్పం ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ విజయ్ కుమారి ఆధ్వర్యంలో 1400 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కుప్పం బిజెపి ఇన్చార్జ్, కుప్పం రెస్కో డైరెక్టర్ తులసీనాథ్ మాట్లాడుతూ.... పర్యా వరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని బీజేపీ కుప్పం ఇన్చార్జ్ తులసినాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటుకోవాలని ఆయన సూచించారు.

## ఏకాంబరంకు ఉత్తమ క్యారెక్టర్ అవార్డు

### చిన్నారిని ఆశీర్వదించిన గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపా లక్ష్మి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్:**
పాన్ ఇండియా మూవీ కాంతార సినిమాలో శ్రీరంగరాజపురం మండలం వెంకటాపురం పంచాయతీ పొదలపల్లి గ్రామానికి చెందిన ఏకాంబరం ఉత్తమ క్యారెక్టర్ విలన్‌గా అవార్డు రావడం జరిగింది. దీంతో ఏకాంబరం తమ స్వగ్రామంలో గంగాధర నెల్లూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కృపా లక్ష్మి చేతులు మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ సినిమా రంగంలో ఉత్తమ ప్రతిభ చూపి మరిన్ని అవార్డులను సొంతం చేసుకోవాలని అన్నారు. గ్రామస్తులు సైతం ఏకాంబరం నటనను ప్రశంసించారు. అలాగే ఏకాంబరం మనవుడు0 తేజేష్ జన్మదిన వేడుకలు వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, మండల కన్వీనర్ మనీ, ఎంపీపీ సరిత జనార్ధన్, స్థానిక సర్పంచ్ విజయ, నాయకులు కాలప్ప, మహేష్, సుధాకర్, జయ, రఘు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143